# అహా!

కన్నసామి

ఇది ఈనాటి కథకాదు. నేనింకా మావూరి ఎలిమెంటరీ స్కూల్లో చదువుతున్నప్పటి భోగట్టా!

ఒక ఆదివారం నేనూ మా అక్కయ్యలూ చద్దిఅన్నాలు తిని విశాలమైన మా వీధి అరుగుల మీదకు వచ్చాం! శీతకాలం! పచ్చిక మీద మంచు బొట్లు చూస్తూ వెచ్చని ఎండకోసం కాచుకూర్చున్నాం. ఇంతలో మా తాతయ్య 'ఇంకా ఎండరాలేదర్రా' అంటూ వచ్చాడు. ఇంక మా కాలక్షేపానికి లోటులేదు. కథ చెప్పమన్నాం. 'పగలు కథ ఏమిట్రా' అన్నాడు. ఏవో కబుర్లు ప్రారంభించేసరికి-వీధిలోనుంచి ఒక ఆడమనిషీ (అడుక్కునేదానిలా వుంది) చిన్నపిల్లా, మా యింటికి వచ్చారు. "తెల్లవారిందో లేదో అప్పుడే ముష్టివాళ్లు! పొండి" అంది పెద్దక్కయ్య. ఆ ఆడమనిషి దీనంగా ముఖంపెట్టింది. నాకు జాలివేసింది. ఆమె యిలా చెప్పడం ప్రారంభించింది.

"ఈయేలకి పదేను రోజులైంది బాబూ యిల్లా ఊరూరూ తిరుగుతున్నాను—"

"తిరక్కపోతే ముష్టి దొరుకుతుందా" అన్నాను నేను మధ్యలో.

"ముష్టికోసం కాదు బాబూ! రెండునెలల కిందట నా పెనిమిటి పక్షవాతంవచ్చి మంచానపడ్డాడు. ఏ డక్టర్లూ బాగుసెయ్యనేకపోయారు బాబూ! అంతలో మా అదృష్టంకొద్దీ చేతిలో గంటపట్టుకుని తలపాగా చుట్టుకొని, వుంటాడొక జంగం—మావూరొచ్చినాడు బాబూ" మేమందరం కళ్లార్పకుండా చూస్తున్నాం- వింటున్నాం "తర్వాత" అన్నాం. "ఆఁ వింటున్నారు కదా" అనుకుందేమో ఇంకా ఉత్సాహంగా చెప్పకుపోతూవుంది

"అతగాడు మా ఘనమైన వొయిద్యుడు బాబూ! అతగాడి సెయ్యి తగిలేసరికి వారంరోజుల్లో మన మణిసై పోయినాడు బాబూ"

"బలే బలే" అంది చిన్నక్కయ్య.

తాతయ్య మాట్లాడకుండా వింటున్నాడు.

"అయితే నువ్విప్పుడు తిరగడమెందుకు" అన్నాను నేను.

"అదే సెప్తన్నాను బాబూ నారాత బాగులేదు. ఆ వొయిద్యుడు పత్తేం ఎంతసెప్పి ఎల్లినా ఇతగా డినిపించుకుంటేనా—మళ్లీ తిరగబెట్టింది బాబూ ఆ జబ్బు. ఊరూరా ఆ వొయిద్యుడుకోసం తిరుగుతున్నాను బాబూ" అన్నదా ఆడమనిషి.



"పాపం" అనుకున్నాం. తాతయ్య ఒక పిడికెడు బియ్యం పడెయ్యమన్నాడు. నేననుకున్నాను "ఆమె ముష్టికి రాలేదుకదా" అని.

# వెంకన్న



"బాబ్బాబు నా బాబే" అన్నదామె. నేను నాలుగు గింజలు పడేసి "తాతయ్యా అంత మంచి వైద్యులుంటారా! కిష్టప్పగారెన్ని మందులిచ్చినా మరి పనిచెయ్యవేం" అన్నాను. ముష్టిమనిషి తాతయ్య వైపు చూస్తూ "మా ఘనమైన సెయ్యిబాబూ ఎంత జబ్బైనా ఆయన సెయ్యేస్తే ఎగిరి పోవలిసిందే" అన్నది.

తాతయ్య మౌనం చూసి మేమూ ఊరుకున్నాం. ఆమె "ఒస్తాను బాబూ" అని వెళ్ళిపోయింది. తాతయ్యతో నేనన్నాను—

"ఈ వైద్యుడు మన వూరొస్తే వెంకటం మామయ్య పక్షవాతం బాగు చేయిస్తే?" తాతయ్య బోసి నోటితో ఒకసారి నవ్వాడు. నేను ఏం తప్పుగా మాట్లాడానో అని భయపడి ఊరుకున్నాను ఒక పట్టు పొడుం పీల్చి తాతయ్య ప్రారంభించాడు.

"ఇప్పుడు జ్ఞాపకమొస్తావుంది. నీ చిన్నప్పుడిలానే దారినపోయే ఒక కుటుంబం వచ్చింది." అన్నాడు తాతయ్య పెద్దక్కయ్యావైపు చూసి. "ఊహూ" అన్నాం

"ప్రతి యింటికివచ్చి ‘బబూ ఆవాల వెంకన్న అని గొప్ప వైద్యుడు కోసం వెదుకుతున్నాం. మీకు తెలిస్తే చెప్పండి. నాకొడుకు ప్రాణాలు కాపాడినవారవుతారు. ఆయన సేతినలవ మా మంచిది' అంటూ ఉంది.

"పాపం చివరకు దొరికాడా" అన్నది చిన్నక్కయ్య.

చెప్తున్నా. ఎవళ్ళం తెలియదని చెప్పేశాం. ఆ విధంగా ఊరందర్నీ ఈ కుటుంబం అడగడంవల్ల ‘ఆవాల వెంకన్న’ గొప్ప వైద్యుడని తెలిసింది ప్రజలకు కొందరా వైద్యుడు తమ వూరుకొస్తే బాగుండుననుకొన్నారు

మరునాడుదయం వీధిలో మందులు కావాలా అంటూ అడుగుతున్నాడు. అడిగిన వారితో గట్టిగా తనపేరు ఆవాల వెంకన్న అనీ తనకేదో దేశంలో మంచిపేరు వున్నదని చెబుతున్నాడు. అతని మాటలు విని ప్రజలు తమ అదృష్టం పండిందనుకున్నారు.

‘ఇలా యిలా నీకోసం నిన్న నెవరో వచ్చారయ్యా’ అంటే ఒక్క చిరునవ్వు నవ్వి "అలా యెందరో తనకోసం తిరుగుతూ వుంటా"రన్నాడు. అతని అదృష్టం వల్ల ఒక పాతికరూపాయలమందుల దాకా అమ్ముడయాయి.

ఇంకా ఎంతో దూరం వెళ్లాలని ఆవూరు విడిచి పోయాడు. మరి కొన్నాళ్లకు అతని మందులు పని చెయ్యడంలేదని తెలిసింది. పైగా కొందరికి ప్రమాదం గూడా చేశాయిట.

"అయితే అతను నిజంగా వైద్యుడు కాదూ" అన్నది చిన్నక్కయ్య.

# ★ ఆవాల వెంకన్న ★

"ఇంకా మరి నమ్ముతున్నావా" అన్నది పెద్దక్కయ్య.

"ఎందుకలా చేశాడు?" అన్నాను నేను.

"ప్రజలను మోసపుచ్చి డబ్బు సంపాదించాలని ముందు — వాళ్ళే కొందర్ని పంపుతారు పేరు ప్రచారం చెయ్యడానికి" అన్నాడు తాతయ్య.

ఆ వేళ రాత్రి నాకు నిద్ర రాలేదు. ఆలోచన! 'తాత చెప్పినదే నిజమైతే తెల్లవారేక ఇందాకటి మనిషి చెప్పిన 'గంట, తలపాగా జంగం' రావాలికదా! వస్తే వూళ్లో ఏం తమాషాలు జరుగుతాయో!" అని.

ఉదయం నేనావిషయమే మరిచాను. పదిగంటలవేళ నిన్నముష్టిది చెప్పినట్లే తలపాగా చుట్టుకొని చేత గంటపట్టుకొన్న జంగం కనబడ్డాడు. అతన్ని కొందరు చుట్టుముట్టి గోల చేస్తూ చెఱువు వైపు నడుస్తున్నారు. ఇంతకూ సంగతేమిటంటే—

వెంకటం మావయ్య తన జబ్బుకి పదిరూపాయలు ఇచ్చి మందు పుచ్చుకొన్నాడట. వెంకటం మావయ్య కొడుకు నమ్మకంచాలక "నెల రోజులుండి చికిత్స చెయ్యండి. ఖర్చంతా మేం భరిస్తాం" అన్నాడట. ఈ వైద్యుడు ససేమిరా, నేనుండనూ, వెళ్లిపోవాలి" అన్నాడట. దానితో మరీ అనుమానం జాస్తీ అయి కిష్టప్పగార్ని తీసుకువెళ్ళి మందు పరీక్ష చేయించాడు. అది ఎంతమాత్రం ఏ మందూ కాదు! వట్టి ఎఱ్ఱదుంపల పిండి!! ఆ పది రూపాయలూ కక్కమని గోలచేస్తున్నారిప్పుడు అందరూ.' ఇప్పటికి తాతయ్యమాటల్లో నిజం తెలిసింది.

పేటవైపునుంచి ఇద్దరు వ్యక్తులు వచ్చి "ఆవాల వెంకన్నను..." అడుగుతున్నారు. "చాలోయ్! ఇంకా ప్రచారం. దొంగ వెధవని పట్టుకున్నార్లే" అన్నారొకరు జవాబుగా. "మేమేం ప్రచారానికి రాలేదండి. మాడబ్బు కక్కాలి! అప్పుడు మేం కదలాలి! వీడి తాట ఒలుస్తాం" అంటూ చెఱువు వైపు పరుగెత్తారు.

చెఱువువైపు నుంచి వస్తూ నే తాతయ్య అన్నాడు- "ఆవాల వెంకన్నేరా వీడు! ఎలాగయితేం ఎనిమిది రూపాయలు కక్కాడులే! బతిమలాడితే రెండు రూపాయలు వొదిలేశారు. నిన్నటి ముష్టిది - వాడి పెళ్లామే! మొగుడూ పెళ్లాం కూతుళ్లు గట్టుకింద పండుకుంటున్నారు. ★




ఆంధ్ర ఏజెంట్లు: మెసర్సు పి ఆర్. ట్రేడ్ ఏజెన్సీస్, విజయవాడ.